ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శనివారం 24 ఫిబ్రవరి 2024



ప్రశ్నార్థకంగా సెస్ భవిష్యత్

- ఆదాయ, వ్యయాల్లో భారీగా అవకతవకలు
- ఎన్‌పీడీసీఎల్‌లో విలీనంపై సర్వత్రా చర్చ

భక్త జనహోరు

- వనదేవతల రాకతో మేడారానికి పోటెత్తిన భక్తులు

8లో..



శివంగాలపల్లిలో సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు వందనం

- సమ్మక్క సారలమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- నిలువెత్తు బంగారం.. బోనాలతో నైవేద్యం
- తొమ్మిది చోట్ల కొలువుదీరిన వనదేవతలు
- ఊరూరా జాతర సందడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వనదేవతలు కొలువుదీరడంతో భక్తిపారవశ్యం వెల్లివెరిసింది. సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. భారీ సంఖ్యలో భక్తులు గద్దెల వద్దకు తరలివచ్చారు. శివసత్తుల సిగాలు, భక్తుల పూనకాలతో పరవశించిపోయారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక కొలువుదీరడంతో శుక్రవారం జాతర సందడి నెలకొంది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్, మండెపల్లి, కోనరావుపేట మండలం శివంగాలపల్లి, వీర్నపల్లి మండలం శాంతినగర్ బానోతు గిరిజన తండా, బాబాయి చెరువు తండా, ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు వంతడ్పుల, కందికట్కూర్, ముస్తాబాద్ మండల కేంద్రం, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో సమ్మక్క, సారలమ్మ జాతరలకు వివిధ గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. మూడో రోజు సమ్మక్క, సారలమ్మలకు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద మహిళలు బోనాలు, నిలువెత్తు బంగారం సమర్పించారు. శివంగాళపల్లిలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఓబులాపూర్‌లో ఏఎస్పీ చంద్రయ్య, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు వనదేవతలను దర్శించుకున్నారు.

ఇల్లంతకుంట: సామ్మక్క సారలమ్మకు రెండో రోజు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఇల్లంతకుంట, వంతడుపుల, కందికట్కూర్‌లో శుక్రవారం భక్తులు ఎత్తు బంగారం, ఎదురుకోళ్లు సమర్పించారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, ప్యాక్స్‌వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి మొక్కులు తీర్చుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలను గ్రామ శివారులోని ఆలయం వరకు తీసుకెళ్లి తల్లులకు సమర్పించారు. పిల్లాపాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు ప్రత్యేక పూజలు నిర్వహించి తల్లులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీర్నపల్లి: వనదేవతల జాతర వీర్నపల్లి మండలంలోని బాబాయి చెరువుతండా, శాంతినగర్‌లో అమ్మవార్లను శుక్రవారం భక్తులు దర్శించుకున్నారు. ఎంపీటీసీ బానోత్ పద్మ, మాజీ సర్పంచ్ కమటం మల్లేశం, ఆలయ నిర్వాహకులు దేవేందర్ నాయక్, రాజునాయక్, విఠలానాయక్, రఘుపతి పూజలు నిర్వహించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. వేడుకల్లో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, కట్ట బాపురావు, సురేందర్‌రావు, ఎద్దండి నర్సింహరెడ్డి, పూజారి పుల్కారి రాజమల్లయ్య, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్‌లో సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు మీరాల భాస్కర్ యాదవ్ అమ్మవార్లను దర్శించుకున్నారు. సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు సుధాకర్, ప్రశాంత్‌రెడ్డి బందోవస్తు నిర్వహించారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం శివంగాలపల్లిలో మూడు రోజులుగా సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం వనదేవతలకు బోనాల పండుగను నిర్వహించారు. మర్తనపేట మార్గదర్శి పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి ఆధ్వర్యంలో చలివేంద్రంతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో బోనాల ఊరేగింపు



శాంతినగర్‌లో వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కోనరావుపేట మండలం శివంగళపల్లిలో తల్లులను దర్శించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ నాయకులు



ఇల్లంతకుంటలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



ఓబులాపూర్‌లో భక్తుల రద్దీ

జిల్లా ఆస్పత్రులు, నర్సింగ్‌హోం అసోసియేషన్ కార్యవర్గం



డాక్టర్ రాపెల్లి రమేష్



డాక్టర్ జైల్ సింగ్



డాక్టర్ మురళీకృష్ణ

సిరిసిల్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్‌హోం అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్ .రమేష్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎ.జైల్ సింగ్, కోశాధికారిగా డాక్టర్ కె.మురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా డాక్టర్ సీహెచ్ శంకర్, డాక్టర్ కె.మనోహర్, డాక్టర్ జి.సత్యనారాయణ స్వామి, డాక్టర్ పి.పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె.ప్రసాద్‌రావు, డాక్టర్ ఎన్‌వీ రమణారావు, డాక్టర్ ఎస్. మధు, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.అనంతరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ పి.లీలాశిరీష, డాక్టర్ చీకోటి సంతోష్, డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, డాక్టర్ ఎన్.ప్రదీప్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్ సన్మానించారు.

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం

ముస్తాబాద్, ఫిబ్రవరి 23:మండలంలోని మద్దికుంట శివారులోని మెట్టు రాజరాజేశ్వర స్వామి, దుర్గామాత, అంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం గోద అంజిబాబు, భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో వేద పండితులు శివపార్వతుల కల్యాణ మహోత్సావాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.మాధవనంద సరస్వతీ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, భాగ్యశ్రీ భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : జిల్లాలోని ప్రజల సమస్యలతోపాటు రెవెన్యూకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం తహసీల్దార్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు నమోదు, జాబితా, రెవెన్యూలో పెండింగ్ కోర్టుకేసులు, మీసేవా దరఖాస్తులు, ప్రభుత్వ భూములు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ పేర్లతోపాటు చనిపోయినవారి ఓటు ఉండకూడదన్నారు. ఓటు హక్కు తొలగింపుపై సమాచారం ఉండాలని, జాబితాను మరోసారి సరి చూసుకోవాలని సూచించారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ నమోదుపై ఆరా తీశారు. వివిధ శాఖల వద్ద ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో అనంద్‌కుమార్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ఓటు హక్కు, నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఓటు హక్కు నమోదుపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, వ్యవసాయ, నర్సింగ్, ఐటీఐ కళాశాలల నుంచి క్యాంపస్ అంబాసిడార్‌లుగా ఎంపిక చేసిన విద్యార్థులకు శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో అందుబాటులో ఉన్న సేవలు, ఓటు హక్కు నమోదు, అర్హత వయస్సు, ఆన్‌లైన్‌లో ఓటు హక్కు నమోదులో తరచూ చేసే తప్పులను ఎలా నివారించాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పట్టణాలతోపాటు గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోనేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నర్సింహులు, డీఎంఎల్టీ మహేందర్‌రెడ్డి, ఎన్నికల అధికారి రెహమాన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23 : సంతు సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో గిరిజనుల సంక్షేమ సంఘం కోసం కేటాయించిన స్థలంలో శుక్రవారం గిరిజన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌ను గిరిజన సంఘాల నాయకులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం సంతు సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గిరిజనులకుపోడు భూముల పట్టాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, భూక్యరెడ్డినాయక్, అగ్గిరాములు, వీర్నపల్లి జడ్పీటీసీ గుగులోతు కళావతి సురేష్ నాయక్, భూక్య గజన్‌లాల్ పాల్గొన్నారు.

అనవసరంగా ఆపరేషన్లు చేయొద్దు

సిరిసిల్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మొదటి కాన్పులోనే ఆపరేషన్లు చేయడం సరైన పద్ధతి కాదని, అవసరమైతే తప్ప అనవసరంగా ఆపరేషన్లు చేయవద్దని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీరాములుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. కాన్పుల సమయంలో జరిగిన అపరేషన్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రసవాలు చేసే గైనకాలజిస్టులతో ఎన్నో సార్లు సమావేశాలు నిర్వహించామని, అపరేషన్లు వీలైనంత వరకు తగ్గించాలని ఆదేశించామని అన్నారు. ఆపరేషన్‌తో తల్లి కోలుకోవడానికి చాలా సమయం పడుతుందన్నారు. అనవసరంగా ఆపరేషన్లు చేసినట్లు నిర్ధారణయితే ఆసుపత్రుల అనుమతులను రద్దు చేస్తామన్నారు. గర్భిణులు, గ్రామంలోని అశాలు, ఏఎన్‌ఎంల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. సాధారణ కాన్పు ద్వారానే సురక్షితంగా ఉంటారని, ప్రభుత్వాసుపత్రులకు కాన్పులకు రావాలని కోరారు.

టీపీఎల్ కప్ ఎంఈవో రాజయ్యకు అంకితం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: ఇటీవల జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్వహించిన టీచర్స్ ప్రీమియర్ లీగ్(టీపీఎల్) క్రికెట్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సాధించిన కప్‌ను ఎల్లారెడ్డిపేట దివంగత ఎంఈవో రాజయ్యకు అంకితం చేస్తున్నామని ఉపాధ్యాయ క్రికెట్ జట్టు పేర్కొంది. శుక్రవారం కప్‌ను మండల వనరుల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈవో రఘుపతికి అందజేశామని తెలిపింది. ఈ సందర్భంగా విద్యాధికారి రఘుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అన్ని అంశాల్లో ముందుండి మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, మల్లికార్జున్, సుమన్, రాజు, అక్బర్, యశ్‌పాల్, తిరుపతి, సంజీవ్, గంగయ్య, లక్ష్మణ్, మధు, సుధీర్, బాలకృష్ణారెడ్డి, రమేశ్, ప్రశాంత్, మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

48వ సారి రక్తదానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు వంగ గిరిధర్‌రెడ్డి శుక్రవారం 48వ సారి రక్తదానం చేశారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో రక్తదానం చేసి పలువురి మన్ననలు పొందారు. ఆయనను బ్లడ్ బ్యాంక్ కేంద్రం ఇన్‌చార్జి స్వామినాయుడు ప్రశంసా పత్రం అందజేశారు. గిరిధర్‌రెడ్డిని స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, అధికారులు, నాయకులు అభినందించారు.

యువకుడికి ఆది శ్రీనివాస్ సన్మానం

రుద్రంగి, ఫిబ్రవరి 23: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి రవి అనే యువకుడు గురుకుల పీడీ టీచర్‌కు ఎంపికయ్యాడు. దీంతో రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, బైరి గంగమల్లయ్య, అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, తర్రె లింగం, ఇప్ప మహేష్, గంధం మనోజ్, పడాల శ్రీనివాస్, ననుగుల గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కోనరావుపేట, ఫిబ్రవరి 23: మండలంలోని బావుసాయిపేటలో వేంకటేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం కన్నులపండుగగా జరిగింది. స్వామివారి కల్యాణం వేదమంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం అర్చకులు ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరోజ్ పాషా, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, నందు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 23: ముంపు గ్రామాల ఆర్థిక అభివృద్ధే సర్కారు లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల మత్స్యకారులకు కేజ్‌కల్చర్‌లో భాగంగా చేప పిల్లల పెంపకంపై వేములవాడ మండలం రుద్రవరంలో శుక్రవారం అవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి కేజ్ కల్చర్ ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో చేపల పెంపకంతో లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలో పరిష్కరించుకుందామన్నారు. ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యమానేరు ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 1600 మత్స్యకారుల కుటుంబాలు రిజిస్టరై ఉన్నాయన్నారు. ప్రస్తుతం మొత్తం 1100 కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. జిల్లా మత్స్యశాఖ అధికారులు కేజ్‌కల్చర్ చేపల పెంపకంపై వీడియో ద్వారా వివరించారు. అనంతరం అనుపురంలో ఏర్పాటు చేసిన మహిళలకు కుటుమిషన్ శిక్షణ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్, మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల తయారీపై 15 రోజులు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణకు వచ్చే మహిళలకు ఉదయం టిఫిన్, భోజనం, స్నాక్స్ ఉంటాయని తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.50 ఇస్తారని, మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ పూజరి గౌతమి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రి, జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, ఎంపిటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, సింగిల్విండో ఛైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య మాజీ సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల మత్స్యకారులకు సువర్ణ అవకాశం

చేపల పెంపకం ముంపు గ్రామాల మత్స్యకారులకు సువర్ణ అవకాశమని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. యూనిట్ మొత్తం విలువ రూ.3 లక్షలని, దానిలో పురుషులకు 40 శాతం, మహిళలకు 60 శాతం సబ్సిడీ ఉంటుందని వెల్లడించారు. గ్రామంలోనే నోడల్ బ్యాంక్ ఆధ్వర్యంలో రేపటి నుంచి శిబిరం ఏర్పాటు చేస్తామని, అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. చేపల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా టూర్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులందరూ వినియోగించుకుకోవాలని సూచించారు. అనుపురంలోని శాలివాహన సంఘం భవనంలో మొదటి విడుత అనుపురం, రుద్రవరం, కొడుముంజ, చింతలఠాణ గ్రామాల్లో డీఆర్‌డీఏ సౌజన్యంతో మహిళలకు టైలరింగ్‌లోని వివిధ మోడల్‌లలో ఆధునాతన ఫ్యాషన్ డిజైనింగ్, మిల్లెట్స్ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ పై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

మాటు కాలువకు మరమ్మతు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

రుద్రంగి, ఫిబ్రవరి 23: నాగరం చెరువు వెళ్లే మాటు కాలువకు మరమ్మతు ప్రారంభించారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు నాగరం చెరువు మాటు కాలువ పలు చోట్ల కోతకు గురైంది. ఈ నెల 17న 'భారీ వర్షాలకు కోతకు గురైన మాటు కాలువ' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం మాటు కాలువకు మరమ్మతు పనులను ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాగరం చెరువు వెళ్లే కాలువ మరమ్మతు పనులను శరవేగంగా చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇరిగేషన్ ఈఈ సంతూప్రకాష్, డీఈ శ్రీనివాస్, నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, సిరికొండ రవి, సూర యాదయ్య, దయ్యాల శ్రీనివాస్, పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి నాగారం చెరువులోకి ఎల్లంపల్లి నీటి విడుదల చేస్తామని అధికారులు తెలపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న సేవలో పీఎఫ్ కమిషనర్



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈఓ నవీన్

వేములవాడ ఫిబ్రవరి 23 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రావిడెంట్ ఫండ్ సౌత్ జోన్ అడిషనల్ సెంట్రల్ కమిషనర్ వైశాలి దయాల్ దర్శించుకున్నారు. శుక్రవారం ఆమె కోడె మొక్కు చెల్లించుకుని శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈఓ ప్రతాప నవీన్ శ్రీస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, గోలి శ్రీనివాస్, అరుణ్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 23: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది తరలించారు.

మంటలు అంటుకుని చెట్లు దగ్ధం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గుట్టపై చెట్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పుతున్నారు. రాత్రి వరకు మంటలు అదుపులోకి వచ్చాయని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వైభవంగా నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించు రథోత్సవానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ఉదయం నుంచి భక్తులు ఎగువ, దిగువ ఆలయాల్లో నృసింహస్వామిని దర్శించుకొని స్వామి వారికి పట్టెనామాలు కోరమీసాలు సమర్పించుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులు చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఆలయ చైర్మెన్ సత్యనారాయణ రావు, ఈవో అనూషతో పాటు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్‌పై కేసుతో కలవరం

- సీఐ నటేష్‌పై సీపీ రిపోర్ట్‌తోనే సస్పెన్షన్ వేటు?
- పలువురు పోలీసు, ఇతర శాఖల అధికారులకు నోటీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదానికి సంబంధించిన భూమిని నిందితులతో కుమ్మక్కై మ్యుటేషన్ చేసినట్లు ఆరోపణలపై గతంలో కొత్తపల్లి తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన చిల్ల శ్రీనివాస్‌పై కొత్తపల్లి ఠాణాలో మంగళవారం కేసు నమోదు కావటం కలకలం సృష్టించింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ తహసీల్దార్‌కు మూడు రోజుల కిందట కరీంనగర్ రూరల్ పోలీసుల సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న తహసీల్దార్ శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ రూరల్ సీఐ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉన్నది.

అయితే శుక్రవారం ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసి తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై అరెస్టు చేయకుండా గురువారం వరకు మినహాయింపు పొందినట్లు తెలిసింది. మరో వైపున జగిత్యాల టౌన్ సీఐ సిహెచ్ నటేష్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయన గతంలో కరీంనగర్ ఒక టో ఠాణా సీఐగా పనిచేసిన సమయంలో పలు భూవివాదాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. సీఐపై కరీం నగర్ సీపీ రిపోర్టు తయారు చేసి ఐజీకి పంపించారని ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది. రెండు నెలల కిందట కూడా పలు ఆరోపణ లపై కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఐలపై సీపీ, ఐజీకి రిపోర్ట్ పంపించి బదిలీవేటు వేసిన విషయం విదితమే. కరీంనగర్‌లో భూకబ్జాలకు సంబంధించి ఇప్పటి వరకు 7 కేసులు నమోదుకాగా 13 మంది అరెస్టు అయ్యారు.

● సీపీ, కలెక్టర్ బదిలీ తప్పుడు ప్రచారంపై నిఘా

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు బదిలీ అయ్యారంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి వైరల్ చేయడంపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దుష్ప్రచారాన్ని ఎవరు చేస్తున్నారు? ఎవరు చేయిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటీవల కొందరు భూకబ్జాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టుకాగా వారి అనుచరులుగా చెప్పకుంటున్న కొంతమంది యువకులు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.



భూ విక్రయంలో మోసం చేసి, బెదిరింపులు

- ముగ్గురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: భూమి విక్రయంలో మోసం చేయటమే కాకుండా చంపుతానని బెదిరింపుల కు పాల్పడిన ఘటనలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న దుర్గం జగన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్,సదాశివపల్లికి చెందిన సింగిరెడ్డి వెంకటరమణారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌టీపీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లాల అజేందర్‌రెడ్డి 2019లో మానకొండూర్ మండలం సదాశివపల్లిలోని సర్వే నెంబరు 442, 447/2, 443లలోని మూడెకరాల అరగుంట భూమిని కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దుర్గం జగన్‌గౌడ్, తిరుపతి అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఆ భూమిలోకి వెళ్లిన అజేందర్‌రెడ్డిని, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అడ్డుకుని ఆ భూమి తనదేనని చెప్పటంతో ఇద్దరి మధ్య భూవివాదం తలెత్తింది. ఈ విషయంపై మాట్లాడేం దుకు అజేందర్‌రెడ్డిని సదాశివపల్లికి పిలిచిన దుర్గం జగన్‌గౌడ్, నందెల్లి మహిపాల్, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి ముగ్గురు కలిసి అజేందర్‌రెడ్డిని చంపుతానని బెదిరించారు.

మోసపోయిన బాధితుడు అజేందర్‌రెడ్డి శుక్రవారం మానకొండూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురు నిందితులపై ఐపీసీ 420, 467, 386, 506, 120-బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసులో దుర్గం జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వసంతోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 23: బీర్‌పూర్ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్స వాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీ నరసింహులకు వసంతోత్సవం కార్యక్రమాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఉత్సవ మూహుర్తులను ప్రత్యేకమైన వేదికపై ఆశీనులగావించి వేదమంత్రోచ్ఛరణల మధ్య వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటి మెంబర్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంటేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాక్స్ డైరెక్టర్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23: మండల సహకార సంఘం డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి గురువారం సాయంత్రం కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై మండలంలోని పొత్తూర్‌కు తిరిగి వస్తుండగా కమాన్‌పూర్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్వినీశ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సౌమ్యుడు శ్రీనివాస్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామన్నారు.

పంది అడ్డురావడంతో బైక్ నుంచి పడి..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఖలీల్లా(35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీల్లా తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా పంది అడ్డురాగా అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై మరణించాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని రైతు..



గౌరు రాజయ్య(ఫైల్)

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం రాళ్లపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాళ్ల పేట గ్రామానికి చెందిన గౌరు రాజయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి రాజయ్య తన పొలం వద్ద నుంచి గేదెను తీసుకొని ఇంటికి వస్తున్నాడు. వెనక నుంచి ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి..

కరీంనగర్ క్రైం: భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో తన సోదరుడి గృహప్రవేశం సమయంలో ప్రమాదవశాత్తుగా కాలుజారి కిందపడి ఈదులగట్టెపల్లికి చెందిన మీస రాంచంద్రం(46) చిక్సి పొందుతూ మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న భవనం మూడో అంతస్తు పైనుంచి కిందపడడంతో రాంచంద్రంకు తీవ్రగాయాలయ్యాయన్నారు. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, హైదాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఆర్టీసీ డిపో-1లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన షెడ్యూల్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రెండు సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్యలో జన్మించిన బాల బాలికలు ప్రవేశాలకు అర్హులని అన్నారు. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదా యం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల మించరాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లనుంచి పొం దాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మీసేవ, మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి పొందాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల జిరాక్సు ప్రతులపై గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ఈనెల 25 నుంచి మార్చి 12వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో పొంద వచ్చన్నారు. దరఖాస్తులను మార్చి 12న సాయంత్రం ఐదుగంటలలోపు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో జతచేసి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంజన్న పైసలేవీ..?

- ఖాతాకు చేరని రూ.37.90లక్షల టెండర్ సొమ్ములు
- కొండగట్టులో అధికారుల నిర్వాకం



మల్యాల, ఫిబ్రవరి 23: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే వివిధ దుకాణాల టెండర్‌దారులు చెల్లించే డబ్బులు అంజన్న ఖాతాకు చేరకపోవడం తీవ్ర దుమారం లేపుతోంది. వ్యాపారులు తమ టెండర్ సొమ్ములను దేవస్థానానికి విడతల వారీగా చెల్లిస్తుండగా 2023-24 సంవత్సరానికి గాను కొందరు వ్యాపారులు దేవస్థానం అధికారు లకు చెల్లించారు. వాటికి రశీదులు కూడా ఇవ్వగా ఆ డబ్బులు మాత్రం దేవస్థానం ఖాతాలో చేరలేదు. ఇటీవల దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో దేవస్థానం అధికారులు తమ అకౌంట్స్ తనఖీలు చేశారు. ఇందులో రూ 37.90లక్షలు బ్యాంక్ లెక్కల్లో కనిపించకపోగా విచారణ చేశారు. సంబంధిత వేలంల సెక్షన్ అధికారి వాటిని ఖాతాలో జమ చేయనట్లు గుర్తించారు. కొబ్బరికాయలకు సంబందించి రూ.31.80లక్షలు, కిరాణం రూ.60వేలు, హోటల్ రూ.50వేలు, సులబ్ కాంప్లెక్స్ రూ.2లక్షలు, పూలు, పండ్లు రూ.3లక్షలు ఆయా వ్యాపారుల నుంచి అధికారులు వసూలు చేసినప్పటికీ వాటిని జమ చేయకుండా సొంతంగా వినియోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు వసూలు చేసి ఖాతాలో జమ చేయనట్లు తేలడం చర్చ నీయంశంగా మారింది.

దీంతో గతంలోని వాటిని కూడా తనిఖీలు చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతుండగా దేవాదాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వెంకటేష్‌ను వివరణ కోరగా.. ఖాతాలో జమ చేయనట్లు తమ దృష్టికి వచ్చిందని సదరు ఉద్యోగికి నోటీసు అందించనున్నట్లు తెలిపారు. సదరు వేలంల సెక్షన్ అధికారిని కూడా సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ స్విచాఫ్ వచ్చింది.

కాంగ్రెస్ హామీలకు నో 'గ్యారెంటీ'

- పథకాల అమలుకు సిద్ధంగా లేని సర్కారు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 23: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుతో కలిసి కాళేశ్వరం ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు బతుకు భరోసా ఇవ్వలేకపోతోందన్నారు. సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడు తు న్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పక్కన బెట్టి వాటిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రమంతా సాగు, తాగు నీటిని అందిస్తే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో మేడిగడ్డలో చిన్న పిల్లర్‌లో సమస్య ఏర్పడితే సరిచేసి నీళ్లు అందించాలని గానీ కాలయాపన చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బ్లాక్ మెయిలింగ్, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ చర్యలను ఖండిస్తున్నామన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23: బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి మాదిగలను గెలిపించాలని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు చేరుకున్న ఆయన నగరంలో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు విని, ఆయా పార్టీలకు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం మతకల్లోలాలు, కింది స్థాయి జాతుల అణచివేతతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి వెలుతుందన్నారు. ఆయా పార్టీలకు ఓటు వేయకుండా సబ్బండ కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వీర్గకరణ కోసం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వంపై ఎన్నడూ ఒత్తిడి చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాదిగలను రాజకీయంగా అణచి వేశారని ఆరోపించారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. అందులో భాగం గానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లను తగ్గించిందని ఆరోపించారు. మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా దక్కదన్నారు. రాష్ట్రంలో మాదిగలు బీజేపీని ఓడించడమే 30ఏళ్ల వర్గీకరణకు ఇచ్చే సంపూర్ణ మద్దతు అని అన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అతి ప్రమాదకరంగా ఉందని, దీనిని కాపాడాల్సిన బాధ్యత చైతన్యవంతులైన మాదిగలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య, అక్కనపల్లి కరుణాకర్, బండ శ్రీను, ఆరెపల్లి అరుణ్‌కుమార్, కనకం వంశీ, గడ్డ యాదయ్య, బోరెల్లి సురేష్, మైన ఉపేందర్, ముత్యపాగం నరసింహరావు, ప్రసాద్, నక్క మహేశ్,దేవరకొండ నరేష్, గద్దల రమేశ్, జోగు గణేశ్, మీసాల మహేశ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో గల ఓ మూడతస్తుంతల భవనంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న నివాస గృహాల వాళ్లు భయందోళనకు గురయ్యారు.

గొల్లపల్లిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: మండలంలోని గొల్లపల్లి , బొప్పాపూర్ గ్రామాల్లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు మొడుసు సత్యంరెడ్డి దుకాణంలో దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. బొప్పాపూర్ సత్తే పీరీల దర్గా సమీపంలోని సత్యంరెడ్డి దుకాణం తాళాలు పగలగొట్టి రూ.3 వేల విలువైన కూల్ డ్రింక్స్, సిగరెట్ ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలి



రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23: కరీంనగర్ ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆద్వర్యంలో ఈనెల 25న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాటరన్, మానేరు విద్యాసంస్థల అధినేతి కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పోటీల వాల్ పోస్టర్‌ను ఆయన ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే కుంగ్‌ఫూ క్రీడలకు కరీంనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందన్నారు. కరాటే కుంగ్‌ఫూలతో ఆత్మస్థైర్యం ఆత్మ విశ్వాసం పెంపొందుతా యన్నారు. ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కరాటే కుంగ్‌ఫూలలో శిక్షణ పొందాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఇలాంటి విద్యలో శిక్షణ పొందాలని సూచించారు. తొలిసారిగా జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. పోటీల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, నిర్వాహకులు ఎ శ్రీనివాస్, జూడో సంఘం రాష్ట్ర బాధ్యులు సిలివేరి మహేందర్, ఉషు సంఘం ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు లింగమూర్తి, మోయిన్, కోడూరి శేఖర్, లంక రవివర్మ, సాయిమానేరు ప్రిన్సిపాల్ సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రభాకర్ (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 23: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గన్నెవానిపల్లె పరిధిలోని నిమ్మవానిపల్లెలో శుక్రవారం విద్యుదాఘాతం తో నిమ్మల ప్రభాకర్(42) మృతి చెందా డు. ప్రభాకర్ తన పొలం వద్ద గడ్డికోయడానికి వెళ్లగా, బోరు మోటార్‌కు వచ్చే సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అవడంతో గమనించని ప్రభాకర్ వైరుకు తగలడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : మండలంలోని బంద నకల్ గ్రామానికి చెందిన అల్మాస్‌పూర్ ఆశయ్య (52) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శేఖ ర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న ఆశయ్య మనస్తాపంతో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణిం చాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆశయ్య కూతు రు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రంగి, ఫిబ్రవరి 23: రుద్రంగి మండలం దేగవాత్ తండా గ్రామంలోని కున్‌సోత్ తండాకు చెందిన కున్‌సోత్ ముత్యాలి (90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సంవత్సరాలుగా ముత్యాలి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ -1 ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, క్రైం బర్కింగ్ ఆరో పణల్లో విచారణ జరిపిన నేపథ్యంలో నటేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, కేసులు నమోదు చేయకుండా జాప్యం వహించ డం, అవినీతికి పాల్పడడం వంటి ఆరోపణలపై ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు నటేశ్‌పై విచారణ జరిపించినట్లు సమాచారం. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి ఇజ్రాయిల్ దేశానికి పంపిస్తానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యవహారంలో సీఐ నటేశ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను ఇటీవల బదిలీ చేయగా రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బదిలీని నిలిపివేయించుకోవడం సైతం ఉన్నతాధికారుల అసంతృప్తికి కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఐ నటేశ్ సస్పెండ్ వ్యవహారం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

చిరుత దాడిలో మేక మృతి

చందుర్తి, ఫిబ్రవరి 23 : చందుర్తి మండలం లింగంపేట శివారులో చిరుత పులి సంచారం మండల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని లింగంపేట అటవీ ప్రాంతం శివారులో చిరుతపులి దాడిలో మేక మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. లింగంపేట అటవీ ప్రాంతంలో గ్రామంలోని ఈగ రాజేశంకు చెందిన మేక మృతి చెందిన విషయాన్ని గ్రామస్థులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతం శివారులో మృతి చెందిన మేకను పరిశీలించగా చిరుతపులి దాడి చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

గల్ఫ్‌లో బొప్పాపూర్ వాసి హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు(45) బహ్రయిన్‌లో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిమ్మల రాజు 15 ఏళ్లుగా బహ్రయిన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, రోజులాగే విధులకు వెళ్లిన అతను ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడన్నారు. మిత్రులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. పరీక్షించిన అక్కడి వైద్యుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారన్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధురాలు మృతి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : పట్టణానికి చెందిన సిర్ప సుజాత(60) శుక్రవారం ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందిం దని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిర్ప సుజాతకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్త లక్ష్మీనారాయణ, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరగగా సుజాత పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ఏరియాలో ఉంటోంది. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది.ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మానసికంగా ఇబ్బంది పడుతోంది. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువలో పడి కొట్టుకుపోతుండగా సమీపంలోని వారు చూసి బయటకు తీసి ఆసపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సుజాత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం




వాన కొండూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని దేవంపల్లి గ్రామంలో గల కాకతీయ డిబిఎం 6 ఉపకాల్వలో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాకతీయ ప్రధాన కాల్వ నుంచి డీబీఎం 6 ఉపకాల్వలో ఓ వ్యక్తి మృత దేహాన్ని గ్రామస్థులు గుర్తించి కాల్వలో నుంచి బయటికితీసారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాజీకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూలైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

భక్త జన హోరు..

వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న నేతలు


అమ్మవార్లను దర్శించుకున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట ఫిబ్రవరి 23: కోనరావుపేట మండలం శివంగాలపల్లిలో సమ్మక్క సారలమ్మను బీఆర్ఎస్ నేతలు దర్శించుకున్నారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, చల్మెడ ఆసుపత్రి చైర్మన్ లక్ష్మీ నరసింహారావు, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, రాఘవరెడ్డి, మార్గదర్శి పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి, మాజీ జడ్పీటీసీ అన్నపూర్ణ దర్శించుకున్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని బాబాయ్ చెరువు తండా, శాంతినగర్ గ్రామాల్లోని వన దేవతలైన సమ్మక్క, సారలమ్మలను బీజేపీ నాయకులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. దర్శించుకున్న వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, నాయకులు పిట్ల నాగరాజు, మాలోతు లక్‌పతి, బానోతు శ్రీనివాస్, బానోతు తిరుపతి, బానోతు జీవన్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23: కమిటీ సభ్యులు రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సాయినగర్‌లో భారతీయ కిసాన్ సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘ్ రైతుల పక్షాన వారి సమస్యలపై స్పందిస్తుందన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు కుసుమ గణేష్, చిప్ప దేవదాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23: తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర 8వ మహాసభలకు కవులు, రచయితలు, మేధావులు తరలిరావాలని వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం కోరారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక, మానేరు రచయితల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర 8వ మహాసభల కరపత్రాలను జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం ఆవిష్కరించారు. ఉద్యమకాలంలో వేదిక తెలంగాణ సమాజానికి దిక్సూచిగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్‌గౌడ్, పురుషోత్తం పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి

చందుర్తి, ఫిబ్రవరి 2: పొట్ట దశకు వచ్చిన పంటలు ఎండిపోకుండా మండలానికి ఎల్లంపల్లి కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రవికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలు ఎండిపోతున్నాయని రెండు రోజులు మాత్రమే నీటిని విడుదల చేసి అధికార పార్టీ నాయకులు చేతులు దులుపుకున్నారన్నారు. సింగిల్ విండో చైర్మన్లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు దుమ్మ అంజయ్య, చిలుక అంజిబాబు, సత్యయ్య అశోక్, పర్శరాములు, నగేష్, పులి మనోహర్, రమేష్ రావు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచులకు సన్మానం

చందుర్తి, ఫిబ్రవరి 23 : చందుర్తి మండలంలో తాజా మాజీ సర్పంచ్‌లను సనుగుల సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు శుక్రవారం సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో తాజా మాజీ సర్పంచ్‌లకు సన్మానం నిర్వహించారు. ఎంపీపీ బైరగోని లావణ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు చిలుక పెంటయ్య, డప్పుల అశోక్, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సర్టిఫికెట్‌పై స్టాంప్ వేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23: దివ్యాంగులకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఇచ్చే కన్సెషన్ సర్టిఫికెట్‌పై సంతకం చేసే సివిల్ సర్జన్ డాక్టర్‌కు సంబంధించిన స్టాంప్ వేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ర వేసి ఇవ్వకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, కోశాధికారి మామిడాల నరేష్, సహాయ కార్యదర్శి బొద్దుల రవి, గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ఎండి ఖాదర్, వెంగల శ్రీనివాస్,రమేష్, అమర్నాథ్, బాలకృష్ణ, బొగ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా సెస్ భవిష్యత్

- ఆదాయ, వ్యయాల్లో అవకతవకలు
- రూ.94.88 కోట్ల రెవెన్యూ లీకేజీని వెల్లడించిన ఈఆర్‌సీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)లో పాలకవర్గాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆదాయ, వ్యయాల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు వస్తున్న విమర్శలు నిజమేనని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఎన్‌సీ) నివేదిక నిరూపిస్తోంది. మరోవైపు సెస్‌ను నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్)లో విలీనం చేస్తారనే చర్చ కూడా కొనసాగుతోంది. రెగ్యులేటరీ కమిషన్ ఇటీవల 2023-24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ సరఫరా టారీఫ్‌లను నిర్ణయించడానికి బహిరంగ విచారణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలోనే సెస్‌లో జరుగుతున్న పలు లోపాలపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిని పరిగణలోకి తీసుకున్న రెగ్యులేటరీ కమిషన్ విచారణ చేపట్టింది. విచారణలో సెస్ కార్యాకలాపాల్లో అవసరమైన నైపుణ్యంలేని సహకార ఆడిటర్ల ద్వారా ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. దీంతో సెస్‌కు సంబంధించిన మెటీరియల్, నిధుల ఆదాయ నష్టం, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఆడిటింగ్ సమర్థంగా లేనట్టు తెలిపింది. 2014 నుంచి 2022 కాలానికి సంబంధించి రూ.94 కోట్ల 88 లక్షల 71 వేల 851 రాబడి లీకేజీ జరిగినట్లు నివేదికల్లో పేర్కొంది. ఇందులో కనెక్షన్లకు సంబంధించిన కేటగిరీల్లో కాకుండా ఇతర కేటగిరీల్లో బిల్లులు నమోదైనట్లు తెలిపింది. పవర్‌లూంలకు సంబంధించి కోర్టు కేసుల్లో ఉండడంతో రూ.18.84 కోట్లు ఆదాయ లికేజీ జరిగినట్లుగా పేర్కొంది. గ్యాంబ్లింగ్ కనెక్షన్లతో రూ.22.16 కోట్లు, కేటగిరీల మార్పుల బిల్లింగ్‌తో రూ.23.77 కోట్లు ఇలా రకరకాలుగా నష్టం వాటిల్లినట్లు కమిషన్ తెలిపింది. దీంతోపాటు సెస్‌కు సంబంధించిన స్టోర్‌కు బీమా లేకపోవడంతో 2018- 2019లో వరదల కారణంగా భారీ నష్టం జరిగినట్లు పేర్కొంది. స్ర్కాప్ తొలగింపు లేకపోవడంతోపాటు రాయితీలు, మూలధన వ్యయం, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వం నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించింది. ఈ క్రమంలోనే ఎన్‌పీడీసీఎల్‌లో సెస్‌ను విలీనం చేయాలని ఈఆర్‌సీ సిఫార్సు చేసినట్లుగా చర్చ జరుగుతోంది. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో గతంలో కూడా అవినీతి జరిగినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సంఘటనలు కూడా వెలుగు చూశాయి. పలువురు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. 2007 నుంచి 2010 వరకు సెస్‌లో అవినీతి జరిగిందని అప్పటి పాలకవర్గమే విచారణ కమిటీ వేసింది. కొందరు ఉద్యోగులపై వేటు వేయగా ఒక ఏఈ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఆ తరువాత విచారణలు, కోర్టు కేసులు వరకు వెళ్లినా సద్దుమణిగిపోవడం అనుమానాలకు తావిచ్చింది.

● సెస్‌కు బకాయిల భారం రూ.714.57 కోట్లు

సహకార స్ఫూర్తితో 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్ రూ.714.57 కోట్ల బకాయిలతో సతమతమవుతోంది. సెస్‌లో ప్రస్తుతం 2 లక్షల 70 వేల 545 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 1,67,984, వాణిజ్య కనెక్షన్లు 16,974 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1394, పవర్‌లూం కనెక్షన్లు 5,635, వ్యవసాయ కనెక్షన్లు 74,391, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3118 కనక్షన్లు ఉన్నాయి. వీటికి సంబంధించి బకాయిలు గుదిబండగా మారాయి. ఈ సంవత్సరం జనవరి వరకు సెస్‌కు రూ.714.57 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దాదాపు రూ.624.92 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.47.07 కోట్లు, దీనికి సర్ ఛార్జ్‌గా రూ.36.14 కోట్లుతో కలిసి రూ.83.22 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించిన నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి గతేడాది మార్చి 31 వరకు రూ.174.04 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వాటిని పెండింగ్‌లో ఉంచి పల్లె ప్రగతి, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. 2020 ఆగస్టు నుంచి 2023 నవంబరు వరకు రూ.16.76 కోట్లు మళ్లీ పేరకుపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, 1049 ఉండగా వీటికి సంబంధించి రూ.3.64 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.77.81 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నా వ్యవసాయదారుల నుంచి సర్వీస్ రుసుముగా రావాల్సిన బకాయిలు రూ.8.42 కోట్లు, గృహాలకు సంబంధించి రూ.28.76 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ.9.98 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ. 8.68 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ.1.54 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.18.81 కోట్లు బాకీలు ఉన్నాయి. దీంతోపాటు పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.21 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

కరాటే క్రీడకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 23 : కరాటేకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 3న వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. వేములవాడలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని, ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పోటీల చీఫ్ ఆర్గనైజర్ అబ్దుల్ మన్నాన్, రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్ కుమార్, సీనియర్ కరాటే మాస్టర్లు కూరగాయల శ్రీనివాస్, దండుగుల తిరుపతి, లోలోపు రాజు, మానుపాటి తిరుపతి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నందితకు ఘన నివాళి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23 : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించగా శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాస్య నందిత మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, నాయకులు కుంబాల మల్లారెడ్డి, కమ్మరి రాజారాం, గౌరినేని నారాయణరావు, మాట్ల మధు, పోచవేని ఎల్లయ్య, రాజేందర్, బూర తిరుపతి, మహేష్, శ్రీనివాస్, వేముల గంగాధర్, మాదాసు సతీష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేప చెట్టు నరికివేత

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23: మొక్కలు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ ప్రభుత్వాలు, అధికారులు అవగాహన కల్పిస్తుంటే మరో వైపు జిల్లా కేంద్రంలో నీడనిచ్చే వృక్షాలనే నరికేస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్‌లో దాదాపు 60ఏళ్ల చరిత్ర ఉన్న వేప వృక్షాన్ని గుర్తు తెలియన వ్యక్తులు నరికి వేశారు. గతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో ప్రయాణ ప్రాంగణం, మున్సిపల్ దుకాణాల సముదాయం (కాంప్లెక్స్) నిర్మాణ పనుల్లో భాగంగా కొన్ని వేప చెట్లను తొలగించారు. పాత బస్టాండ్‌లో ప్రస్తుతం మూడు వేప వృక్షాలు మిగిలిపోయాయి. హైదరాబాద్, కామారెడ్డి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, సిద్దిపేట వైపు వెళ్లే ప్రయాణికులు దాదాపు ఈ వేప వృక్షం నీడలో బస్సుల కోసం వేచి ఉండేవారు. 60 ఏళ్లుగా ప్రయాణికులకు నీడనిస్తున్న వేప వృక్షాన్ని గుర్తు తెలియన వ్యక్తులు నరికివేశారు. దీంతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వేప వృక్షం నరికివేతపై మున్సిపల్ కమిషనర్ లావణ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా చెట్టు నరికి వేయడంపై తమ సిబ్బంది ప్రమేయం లేదని, ఎవరూ అనుమతి కోరలేదని తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అటవీశాఖ అధికారుల వివరణ కోసం ఫోన్ చేయగా ఎఫ్ఆర్‌వో, సెక్షన్ అధికారి అందుబాటులో లేరంటూ సమాధానం వచ్చింది. గతంలో కూడా సిరిసిల్ల పట్టణం కూరగాయాల మార్కెట్ వెనకాల ఓ చిట్‌ఫండ్ ఉండే వీధిలో దాదాపు మూడు చెట్లను నరికి వేయగా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఆర్యవైశ్య సంఘ భవనానికి భూమి పూజ


భూమి పూజలో ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 23 : వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం భూమి పూజ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేణికింది అశోక్, నాయకులు కట్కూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో కనిపించని అభివృద్ధి

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి కనిపించ లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్ లో మంచినీటి పైప్‌లైన్ పనులకు, గూడెంలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో వేసిన మంచినీటి పైప్‌లైన్‌లో నాణ్యత లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒకే మాట చెప్పారని, అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేవలం రెండు నెలల్లో పది కోట్ల ఎస్‌జీఎఫ్ నిధులు, రెండు కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వచ్చాయన్నారు. మిడ్‌మానేరు నుంచి రంగనాయక్ సాగర్‌కు నీళ్లు తీసుకెళ్లారని, 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తే మానేరు నిండేదని అన్నారు. గూడెంలో అంగన్‌వాడీ సెంటర్‌ను, శిథిలవస్థకు చేరిన వాటర్ ట్యాంకును పరిశీలించారు. నూతనంగా నిర్మించాలని ఎప్పుడు కూలుతుందోనని భయభ్రాంతులకు గురవుతన్నారని గ్రామస్థులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుండం నర్సయ్య, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు యారటి లక్ష్మీ, చిట్నేని సరితశ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బషీర్. శీల ప్రశాంత్, గజ్జెల రాజు, రాంరెడ్డి, ఉచ్చిడి బాల్‌రెడ్డి, క్యారం రాజు, గంత రాజు, నందం, లక్ష్మణ్, బొందుగుల దేవిరెడ్డి, వెంకటరమణ, లింగంపెల్లి ఎల్లాగౌడ్, తలారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

గంభీరావుపేట, ఫిబ్రవరి 23: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి అన్నారు. గంభీరావుపేట మండలం కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్చి 3 ఆదివారం ఉదయం 5 గంటలకు జిల్లా కేంద్రంలో, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో 5కే రన్ ఉంటుందని తెలిపారు. కానిస్టేబుల్ నాగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు తదితరులు పాల్గొన్నారు

వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : ముస్తాబాద్ మండలంలోని బందనకల్ వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఆలయ అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేశారు.